క్లుప్తంగా

భూముల రీసర్వే

కంకిపాడు: మండలంలోని మారేడుమాక గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియ గురువారం చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల రెవెన్యూ అధికారులు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. రైతువారీ భూములకు సంబంధించి ముందస్తు నోటీసులు అందించి భూముల రీసర్వే చేశారు. తహసీల్దార్ వి. భావనారాయణ పర్యవేక్షణలో సర్వేయరు భాస్కర్‌రావు భూములను సర్వే చేయిస్తున్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో పోరంకి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి బహుమతులు గెలిచారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం విద్యార్థులను హెచ్‌ఎం సుమలత అభినందించారు. ఇటీవల నెల్లూరులో అమీర్‌జాన్ ఆర్ట్ అకాడమీ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. పోరంకి పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పదవ తరగతి చదువుతున్న వి.భార్గవి, కె.నాగతేజ, 8వ తరగతి చదువుతున్న సంజన ప్రతిభ చాటి బంగారు పతకాలు గెలిచారు. మిగితా విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. విశ్రాంత చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఆరేపల్లి అప్పారావు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు.

వీఆర్‌ఓల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

కంకిపాడు: గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం కంకిపాడు మండల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి అర్జునరావు సమక్షంలో ఎన్నికలు చేపట్టారు. సంఘం మండల నూతన అధ్యక్షుడిగా కోలవెన్ను వీఆర్‌ఓ మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా విజయ్ కుమార్ (పునాదిపాడు), సుబ్రహ్మణ్యం (వేల్పూరు), కోశాధికారిగా చైతన్య (ఈడుపుగల్లు), మహిళా సంయుక్త కార్యదర్శిగా దుర్గారావమ్మ (కంకిపాడు), కార్యవర్గ సభ్యులుగా డేవిడ్ రాజు, కొండబాబు, సుబ్బారావు ఎన్నికయ్యారు. తీర్మాన ప్రతిని తహసీల్దార్ భావనారాయణకు అందించారు. ఈ సందర్భంగా 2025 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అనూరాధ, ఆర్‌ఐ ఉస్మాన్, సర్వేయరు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం




ఉయ్యూరు: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నేతాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో నేతాజీ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. నేతాజీ ఆశయాలు, త్యాగాలు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కోటేశ్వరరావు, ఏఓ లోయ శివశంకర్ రావు, జబర్లపూడి సర్పంచ్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తోపుడు బండ్ల పంపిణీ

ఉయ్యూరు: పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యత అని రోటరీ కమ్యూనిటీ సర్వీసు ట్రస్టు కార్యదర్శి సీకే వసంతరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ట్రస్టు సహకారంతో రూ. 60 వేలు విలువ చేసే నాలుగు తోపుడు బండ్లు, ఒక ఇస్త్రీ బండిని గురువారం అందజేశారు. వసంతరావు మాట్లాడుతూ దాతల దాతృత్వాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, ప్రతినిధులు సంపత్‌కుమార్, సయ్యద్ అనీస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, సాయి సుభాష్, మీర్జా పాల్గొన్నారు.

కొనసాగుతున్న మండల దీక్ష పారాయణం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న మండల దీక్ష పారాయణం గురువారంతో 23వ రోజుకు చేరుకుంది. అమ్మవారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండల దీక్షను చేపట్టారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాల పొంగళ్లు సమర్పించారు. కాగా నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణానికి మర్లపాలెం గ్రామానికి చెందిన జాస్తి శివప్రసాద్, నాగమల్లిక దంపతులు రూ. 50 వేలు విరాళం ఆలయ కమిటీకి అందజేశారు.

చెత్తకు తోపుడు బండ్లు

- చెత్త తరలించడానికి ప్రత్యామ్నాయం
- సమ్మె బాటలో వ్యాన్ డ్రైవర్లు
- గందరగోళంగా పారిశుద్ధ్య వ్యవస్థ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెత్త తరలింపు గందరగోళంగా మారింది. దీంతో పారిశుద్ధ్య వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో జనాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాన్ డ్రైవర్లు సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయంగా తోపుడు బండ్లను రంగంలోకి దించారు. తాడిగడప మున్సిపాలిటీలో యనమలకుదురు, తాడిగడప, కానూరు, పోరంకి ప్రాంతాలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజూ దాదాపు 120 టన్నుల చెత్త వస్తుంది. తడి చెత్త-పొడి చెత్త వేరువేరుగా సేకరించి తరలించడానికి గతంలో 42 వ్యాన్లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న కాలంలో ప్రతి రోజూ చెత్త తరలించే వ్యాన్లు ఇళ్లకు వచ్చి చెత్త సేకరించి తరలించేవారు. డ్రైవర్లకు సకాలంలో జీతాలు ఇచ్చేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాన్లతో చెత్త సేకరించే కార్యక్రమానికి గ్రహణం పట్టుకుంది. కూటమి ప్రభుత్వం వ్యాన్ డ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో వ్యాన్ డ్రైవర్లు సమ్మె బాట పడుతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలోని వ్యాన్ డ్రైవర్లు గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం వారికి జీతాలు ఇవ్వలేదు.

తోపుడు బండ్లతో సమయం వృథా

కాగా వ్యాన్ డ్రైవర్లకు చెక్ పెట్టడానికి రంగంలోకి తోపుడు బండ్లు(పుష్‌కార్టులు) వచ్చాయి. ఇప్పటి వరకు 41 తోపుడు బండ్లు మున్సిపాలిటీ పరిధిలో చెత్త తరలించడానికి ఏర్పాటు చేశారు. మరో 23 తోపుడు బండ్లు కూడా రానున్నాయి. ఇక వ్యాన్ డ్రైవర్లతో పని లేకుండా తోపుడు బండ్లు ఇళ్ల వద్ద చెత్త సేకరించి తరలిస్తాయి. అయితే ఆచరణలో తోపుడు బండ్లతో చెత్త సేకరించి తరలించడానికి చాలా సమయం పడుతుంది. గతంలో ప్రతిరోజూ వ్యాన్ల ద్వారా ఇళ్ల వద్దకు వచ్చి చెత్త సేకరించేవారు. ఇప్పుడు రెండు రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. దీని వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, స్వయంగా నివాసితులే చెత్త డబ్బాలు తీసుకువెళ్లి దూర ప్రాంతాల్లో వేస్తున్నారు. ప్రతిరోజూ చెత్త ఇళ్ల వద్ద సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తాడిగడప మున్సిపాలిటీలో కొత్తగా వచ్చిన తోపుడు బండ్లు



చెత్త బండి రాకపోవడంతో తమ ఇంటి వద్ద నుంచి చెత్త తీసుకువెళుతున్న చిన్నారులు

కార్మికులను తీసుకోవాలి



మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి కొత్తగా కార్మికులను పనిలోకి తీసుకోవాలి. నేతల సిఫార్సులు ఉన్న వారిని పారిశుద్ధ్య పనిలోకి తీసుకుంటే వ్యవస్థ భ్రష్టు పడుతుంది. పారిశుద్ధ్య పనులు చేసే వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తే సమస్యలు పరిష్కారమవుతాయి. అలాగే వ్యాన్ డ్రైవర్లకు వెంటనే జీతాలు ఇవ్వాలి.

– ఉప్పాడ త్రిమూర్తి, సీఐటీయూ మండల కార్యదర్శి, పెనమలూరు

పారిశుద్ధ్యం ప్రధాన సమస్య

తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య వ్యవస్థ ఎప్పుడు మెరుగుపడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యమే ప్రధాన సమస్యగా ఉంది. దాదాపు 339 మంది కార్మికులు పని చేస్తున్నా పారిశుద్ధ్య సమస్యలు తీరడం లేదు. మున్సిపాలిటీలో పర్యవేక్షణ కరువైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలు లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. పారిశుద్ధ్య కార్మికుల్లో కొందరు సక్రమంగా పని చేయకుండా నేతల అండదండలతో పబ్బం గడుపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీ లక్షల రూపాయలు వెచ్చించినా పారిశుద్ధ్య సమస్య మాత్రం తీరడం లేదు.

సబ్‌జోన్ ఆటల పోటీల నిర్వహణపై సమావేశం



సమావేశానికి హాజరైన సంఘ ప్రతినిధులు

గన్నవరం: సబ్‌జోన్ బాలబాలికల క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సబ్‌జోన్ ఆటల పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాట్మింటన్, షటిల్, టెన్నికాయిట్, సాఫ్ట్‌బాల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. సబ్‌జోన్ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదీల్లో గన్నవరం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో బాలుర సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీన బాలికల విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు హాజరయ్యే బాలబాలికలు ఆయా పాఠశాలల నుంచి ఎలిజిబిటీ పత్రాలను సమర్పించాలని సూచించారు. సబ్‌జోన్ అధ్యక్షుడు సీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బీఎస్ రామచంద్రుడు, జీ కృష్ణప్రియ, సలహాదారులు ఎస్ సుబ్బారావు, ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు



రామయ్య చెరువు వద్ద చెత్త డంప్ సమస్యను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు రామయ్య చెరువు వద్ద చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ లక్ష్మి శకు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా గురువారం గ్రామంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ దృష్టికి చెత్త డంప్ సమస్యను తీసుకెళ్లారు. దీంతో లక్ష్మి శ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో విగ్గిన్స్‌లను సమస్యను పరిశీలించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. గ్రామస్తులతో కలిసి అధికారులు చెరువు వద్ద డంపింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామంలోని చెత్తనంతటిని తీసుకొచ్చి చెరువు వద్ద డంప్ చేయడంతో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయని ఫలితంగా సమీప ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. అలాగే రామయ్య చెరువు పర్యవేక్షణ లోపించడంతో ఆక్రమణలకు గురవుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన అధికారులు పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌ను చెత్తను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు, నగుళ్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డీసీపీ కృష్ణమూర్తినాయుడు

డీసీపీ కృష్ణమూర్తినాయుడు

పెనమలూరు: విద్యార్థులు ట్రాఫిక్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని డీసీపీ కృష్ణమూర్తినాయుడు సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు జరిగిన అర్బన్ ఏరియా ట్రాఫిక్ వలంటరింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం లైసెన్సు కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్టులు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. డీటీసీ మోహన్ మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టాలను కఠినంగా అమలు చేస్తామన్నారు. అలాగే ప్రజలకు కూడా ఇబ్బందులు కలగకుండా వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ 500 మంది విద్యార్థులకు ట్రాఫిక్‌పై శిక్షణ ఇచ్చి వారి సేవలను ఉపయోగించామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివరామగౌడ్, ఎస్‌ఐ లంకే రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెనమలూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోల్లమూడి శేఖర్‌బాబు అన్నారు. కానూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ ఆల్కహాల్, గంజాయి, పొగాకు సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. అలాగే దీర్ఘకాల వ్యాధులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం ప్రతినిధులు కె.ప్రియాంక, ఎస్.జాకబ్‌రాజు, షేక్.నజ్మాహెబ్బుల్లా, జె.జ్యోతి, హెచ్‌ఎం(ఇన్‌చార్జి) ఎ.అబ్రహం పాల్గొన్నారు.

పశు వైద్య ఆరోగ్య శిబిరాలు



గొడవర్రులో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పశువైద్య సిబ్బంది, సర్పంచ్ తదితరులు

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు, మానికొండ గ్రామాల్లో గురువారం పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. మానికొండలో గన్నవరం పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ గోపీచంద్, తేలప్రోలులో గన్నవరం డివిజన్ అల్లాపురం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వి.బాలకృష్ణారావు పాల్గొని శిబిరాలను ప్రారంభించారు. ఈ శిబిరాల్లో 117 పశువులకు వైద్య పరీక్షలు, 150 గేదెలు, 150 గొర్రెలు, 97 మేకలు, 165 కోళ్లకు నట్టల మందు, టీకాలు వేశారు. 50మంది పశు పోషకులకు పశు విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పశు వైద్యులు సుధీర్ బాబు, మల్లిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలనులో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 40 గేదేలతో పాటు ఆవులు, కోళ్లు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి, టీకాలు, మందులు అందించారు. వీరవల్లి ప్రభుత్వ పశువైద్యశాల డాక్టర్ దివ్య, సిబ్బంది సేవలు అందించారు. పాల కేంద్రం అధ్యక్షుడు వీరం రాంబాబు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: గొడవర్రు గ్రామంలో గురువారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ ప్రారంభించారు. పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్ 65 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. బ్రోచర్లను ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు చుండూరు నిర్మలకుమారి, పెనమలూరు ఏడీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. నెప్పల్లిలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో డాక్టర్ ఎస్‌వీఎస్ రంగారావు వైద్య సేవలు అందించారు. కొలుసు గోవిందు, నీటి సంఘం ప్రతినిధి డి.శ్రీనివాసరావు, కొలుసు నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలర్ బాస్కెట్ బాల్‌లో విద్యార్థి ప్రతిభ



రామవరప్పాడు: రోలర్ బాస్కెట్ బాల్ క్రీడలో నగరానికి చెందిన విద్యార్థి ఆర్. సాయిశ్రీ గౌతమ్ ధీరజ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ జట్టులో స్థానం సాధించాడు. నగరంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గౌతమ్ ధీరజ్ ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన నాలుగో జాతీయ స్థాయి రోలర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌తో పాటు గోల్డ్ మెడల్‌ను సాధించాడు. ఈ సందర్భంగా గౌతమ్ ధీరజ్ సొంత ఊరైన నందిగామ సమీప ముప్పాళ్ల గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అభినందనలు తెలిపారు. ఇండోనేషియా వేదికగా ఏప్రిల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ రోలర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో గౌతమ్ ధీరజ్ జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నట్లు కోచ్ పతివాడ ప్రసాద్ తెలిపారు.

ఉత్సాహంగా సబ్‌జోన్ ఆటల పోటీలు



రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ ఫైనల్స్

కంకిపాడు: పెనమలూరు సబ్‌జోన్ ఆటల పోటీలు ఉత్సాహంగా ఆరంభమయ్యాయి. నియోజకవర్గ స్థాయి బాలుర ఆటల పోటీలను గురువారం ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి బాయ్ ప్రారంభించారు. వాలీబాల్‌లో విన్నర్స్ జెడ్పీ ఉయ్యూరు, రన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు నిలిచాయి. కబడ్డీలో విన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు, రన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు గెలిచాయి. ఖోఖో విన్నర్స్‌గా జెడ్పీ మంతెన, రన్నర్స్‌గా జెడ్పీ నెప్పల్లి గెలుపొందాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు, రన్నర్స్‌గా జెడ్పీ మంతెన నిలిచాయి. త్రోబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ గొడవర్రు, రన్నర్స్‌గా జెడ్పీ ఆకునూరు, టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా జెడ్పీ గొడవర్రు, రన్నర్స్‌గా జెడ్పీ మంతెన నిలిచాయి. షటిల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ పెనమలూరు, రన్నర్స్‌గా జెడ్పీ కంకిపాడు, సాఫ్ట్‌బాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ కంకిపాడు, రన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు నిలిచాయి. సబ్‌జోన్ అధ్యక్షుడు ఎం.భవాని, కార్యదర్శి వై.మురళీ పోటీలను పర్యవేక్షించారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తులసీనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి కాలనీ, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, మాణిక్యనగర్, బీఎస్‌ఎన్‌ఎల్ కాలనీ, జయరామ్ టవర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని పటేల్‌నగర్, సాయినగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు మొక్కలు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో 'ఫస్ట్ ఇంపాక్ట్' కార్యక్రమంలో భాగంగా గురువారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అధికారులు మామిడి, కొబ్బరి, బాదం తదితర పండ్ల మొక్కలను వితరణగా అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఏరియా మేనేజర్ ఎం.ఎల్.ఎస్.మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటరు వితరణ

ఉయ్యూరు: ఉయ్యూరు జెడ్పీ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు ఉయ్యూరు శాఖ గురువారం కంప్యూటరు వితరణగా అందించారు. బ్యాంకు ఏజీఎం చంద్రన్ కంప్యూటరు, కుర్చీలు, బీరువా వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోత్స్న బ్యాంకు బ్రాంచి మేనేజర్ కె.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ వీరాంజనేయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ శివసాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో యువకుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. వణుకూరుకు చెందిన కోటా పోలమ్మ, భర్త, తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలిసి ఉంటున్నారు. కుమారుడు కోటా లక్ష్మణ(20) గోసాల శ్రీచైతన్య కాలేజీలో పని చేస్తాడు. అతను సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని తల్లి పోలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రామాల్లో ఎంఎస్‌ఎంఈ సర్వే

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా ఎంఎస్‌ఎంఈ సర్వే జరుగుతోంది. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న పరిశ్రమలు, చిన్నపాటి వ్యాపార కేంద్రాలు, షాపింగ్‌మాల్స్, మెడికల్ షాపులు, ఫ్యాన్సీ, కిరాణా, మొబైల్ షాపులు తదితర వివరాలను సచివాలయ సిబ్బంది సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వ్యాపార సంస్థలకు ప్రభుత్వం జారీ చేసిన ఉద్యమ్ అనే యాప్ ద్వారా ఐడీ నెంబరు ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ బి. విగ్గిన్స్ తెలిపారు. సర్వే చేసే సిబ్బంది వ్యాపారస్తుల వద్దకు వచ్చినప్పుడు జీఎస్టీ నెంబర్లు, ఆధార్‌తోపాటు ఇతర వివరాలు అందించి సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

తాడిగడప వక్ఫ్ భూముల వేలంపాట

పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో వక్ఫ్ బోర్డుకు చెందిన కొండపల్లి ఖాజీ సర్వీసు భూములను ఒక ఏడాది లీజుకు ఇవ్వడానికి వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో 42.86 ఎకరాల వక్ఫ్ భూమికి వేలం జరుగుతుందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు రూ. 50 వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పలువురు మానవత సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద విద్యార్థిని ఎం.దేదీప్యకు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఇటీవలే బీఫార్మసీ పూర్తి చేసినప్పటికీ ఫీజు బకాయిల కారణంగా సర్టిఫికెట్ పొందలేకపోవడంతో 'మానవత' సభ్యులు ఆర్థికసాయాన్ని అందించారు. ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, కోశాధికారి గంటా ఇందిరాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

పెసర, మినుము పంటల పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: రబీ సీజన్‌లో మినుము, పెసర వంటి అపరాల సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణకు తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం కాకులపాడులో పెసర, మినుము పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతావరణంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం, గాలిలో తేమశాతం అధికంగా ఉండటంతో మినుము, పెసర పంటలకు బూడిద తెగులు సోకే అవకాశం ఉందని చెప్పారు. తొలుత ఆకు అడుగు భాగాన తెల్లని మచ్చలు వచ్చి, ఆ తర్వాత మెల్లగా మొక్క మొత్తం వ్యాప్తి చెందుతుందని వివరించారు. దీని నివారణకు డైఫినోక్లోనోజోల్ 200 మిల్లీ మీటర్లు చొప్పున ఎకరాకు పిచికారీ చేయాలని ఏఓ భవాని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెనమలూరు: గంగూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌పాషా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 8 లక్షలతో గ్రామంలో సిమెంట్ రోడ్డు, చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోయా ఆనంద ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, ఇర్ఫాన్‌బాషా, అబ్దుల్ సలాం, అబ్దుల్ గౌస్ పాల్గొన్నారు.